

జాతీయ రహదారుల పనులు వేగవంతం : జెసి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: కేంద్ర పరిశ్రమలశాఖ, భూ ఉపరితలశాఖ కార్యదర్శులు గురువారం మధ్యాహ్నం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. చిత్తూరు జిల్లా సచివాలయం నుండి జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పాల్గొన్నారు. జెసి మాట్లాడుతూ జిల్లాలో చిత్తూరు నుంచి 6 వరసల రహదారికి సంబంధించి జిల్లాలో పనులు పూర్తి అయ్యాయని, బెంగులూరు -చెన్నై ఎక్స్ప్రెస్ హైవేకి సంబంధించి భూసేకరణ పనులు పూర్తి అయ్యాయని పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. చిత్తూరు చెన్నై- తచ్చూరు రహదారికి సంబంధించి 98శాతం భూసేకరణ పనులు పూర్తిఅయ్యిందని తెలిపారు. కార్యదర్శులు మాట్లాడుతూ రహదారులలో రోడ్లు భవనాలుశాఖ, రైల్వేశాఖ, విద్యుత్, మున్సిపల్, భూగర్భ గనులశాఖ, అటవీ శాఖలకు చెందిన సమస్యలుంటే వెంటనే పరిష్కరించాలన్నారు. పనులు వేగవంతంగా జరగాలంటే భూసేకరణ పూర్తి చేయాలన్నారు.

అడ్డంకులు సృష్టించమని...

ఏ రాజ్యాంగంలో ఉంది..?

'యువగళం' పాదయాత్రలో నారా లోకేష్


పాదయాత్రను అడ్డుకుని మైక్‌ను లాగేసుకున్న పోలీసులు, టిడిపి నాయకులు, పోలీసుల మధ్య వాగ్వివాదం

ప్రజాశక్తి - జీడీనెల్లూరు: టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ 'యువగళం' పాదయాత్రకు అడుగడుగునా అవాంతరాలు ఎదురవుతూనే ఉన్నాయి. బహిరంగసభలకు అనుమతి లేదంటూ వాహనాలను అడ్డుకుంటూ, మైకులు లాక్కుంటూ పోలీసులు అడ్డంకులు సృష్టిస్తూనే ఉన్నారు. పలమనేరు నుంచి ఆటంకాలు ఎదురవుతూనే ఉన్నా, పాదయాత్ర ఆగకుండా కొనసాగుతూనే ఉంది. జీడీనెల్లూరు మండలంలో పాదయాత్ర గురువారం 14 కిలోమీటర్లు సాగింది. ఈ నియోజకవర్గంలో నాలుగు రోజుల పాటు 64 కిలోమీటర్లు పూర్తి చేయనున్నారు. ఆవలకొండ వద్ద ఐదు కోట్ల వ్యయంతో నిర్మించిన దర్గాను నారా లోకేష్ ప్రారంభించారు.

లోకేష్‌ను అడ్డుకున్న పోలీసులు

చిత్తూరు జిల్లా గంగాధరనెల్లూరు నియోజకవర్గ పరిధిలో బంగారెడ్డిపల్లి పంచాయతీ సమిసిరెడ్డిపల్లిలో బహిరంగసభ జరగాల్సిఉ ంది. అయితే మైక్‌కు అనుమతులు లేవంటూ అడ్డుకున్నారు. దీంతోకార్యకర్తలకు, పోలీసులకు మధ్య వాదోపవాదాలు జరిగాయి. 'మీటింగ్ ప్రాంగణం కూతవేటు దూరంలో ఉంది. అనుమతి ఇవ్వండి.. ఇలా అడ్డుకోమని ఏ రాజ్యాంగంలో ఉంది' అని లోకేష్ వేడుకున్నారు. వాదోపవాదాల తరువాత పోలీసులు సభ ప్రాంగణానికి దారి వదిలారు.

పాదయాత్ర సాగిందిలా...

యువగళం పాదయాత్ర గంగాధరనెల్లూరు మండలంలోని దేవళంమిట్ట కడపగుంట మీదుగా ప్రారంభమయ్యింది. బంగారెడ్డిపల్లి పంచాయతీ సమిసిరెడ్డిపల్లి దగ్గర ప్రజలతో లోకేష్ మాట్లాడే ప్రయత్నం చేయడంతో పోలీసులు మైక్ లాక్కునే ప్రయత్నం చేయడంతో వాదోపవాదాలు జరిగాయి. అడ్డంకులు సృష్టించినా తన యాత్ర కొనసాగిస్తానని నారా లోకేష్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. భోజన విరామం అనంతరం ఆరిమాకలపల్లి గ్రామానికి చెందిన పవన్ సైకిల్ గుర్తు ఉన్న జెండాలను రోడ్డుపై వినూత్నంగా కట్టడంతో కొంత సమయం ఆగి వారిని పలకరించారు. ఆవలకొండలో దర్గాను ప్రారంభించారు. తూగుండ్రం గ్రామంలో మహిళలు హారతులు ఇచ్చారు. తాటిమాకుల కండ్రిగ గ్రామంతో గురువారం పాదయాత్ర ముగియనుంది. పాలసముద్రం మండలంలోకి ప్రవేశించి రంగాపురం క్రాస్‌లోనే పబ్బంమిట్టలో రాత్రి బస చేయనున్నారు. ఆయన వెంట మాజీ మంత్రి అమరనాథరెడ్డి, జిల్లా ఇన్‌ఛార్జి పులివర్తినాని, నాయకులు పాచిగుంట మనోహర్‌నాయుడు, భీమినేని చిట్టిబాబునాయుడు, గురుసాల కిషన్‌చంద్, స్వామిదాస్, దేవసుందరం కృష్ణమనాయుడు, కటికపల్లి శంకర్, తలారి రెడ్డెప్ప, అంజద్‌అలీ పాల్గొన్నారు.


రాజ్యాంగం చూపుతూ మాట్లాడుతున్న నారా లోకేష్

అలరించిన ఎన్టీఆర్ వేషధారణ

చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నాయకులను కార్యకర్తలను ఉత్సాహంతో ఉత్తేజపరుస్తూ ఎన్టీఆర్ వేషధారణతో చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు మండలం కడపగుంట గ్రామానికి చెందిన ఎన్ త్యాగరాజు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.


మహాదేవ మంగళంలో పాదయాత్రలో నారా లోకేష్

ప్రతిరోజూ అడ్డుకోవడమే పనా... : అమరనాథ్‌రెడ్డి

'నిన్న, నేడూ ఇదే పరిస్థితి.. ప్రతిరోజూ అడ్డుకోవడమే పోలీసుల పనా.. ఇది చట్టబద్దమైన పోలీసు వ్యవస్థా? జగన్‌రెడ్డి పోలీసు వ్యవస్థా... మా కార్యకర్త బాషా చేతిలో హ్యాండ్‌మైక్ ఉంటే కొట్టి మరీ లాక్కున్నారు..' అని మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి మండిపడ్డారు. పాదయాత్ర ప్రాంగణం నుంచే అమరనాథ్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ కార్యకర్తలపై చైన్‌స్నాచర్స్ మాదిరి మైక్ లాక్కుని రక్తగాయాలయ్యేలా చేయడం ఏంటి? అని ప్రశ్నించారు. ఈ దుశ్చర్య వెనుక ఇంటిలిజెన్స్ డిజిపి, జగన్‌రెడ్డి ఉన్నారన్నారు. ప్రశాంతంగా కొనసాగుతున్న పాదయాత్రపై పోలీసులు జులుం ప్రదర్శించి అలజడులు రేపుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపికి శవయాత్రే దిక్కన్నారు. దుశ్చర్యలు ఆపకుంటే ప్రజలే తిరగబడి కొడతారన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి

రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ సిహెచ్.విజయ్ ప్రతాప్‌రెడ్డి


గంగవరంలో విద్యార్థులకు చేసిన భోజనాన్ని తనిఖీ చేస్తున్న విజయప్రతాప్ రెడ్డి

ప్రజాశక్తి- గంగవరం, పలమనేరు, బైరెడ్డిపల్లి: మండలంలోని పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనం భేష్ అని రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ విజయ్ ప్రతాపరెడ్డి అన్నారు. భోజనం నాణ్యతతో రుచికరంగా పౌష్టిక విలువలు కలిగి ఉందని తెలిపారు. గురువారం స్థానిక ఉన్నత పాఠశాలలను విజయ్ ప్రతాపరెడ్డి సందర్శించారు. భోజనం నాణ్యతను పరిశీలించి విద్యార్థులతో పాటు ఆయన కూడా భోజనం చేసి సంతృప్తి వ్యక్తంచ ఏశారు. తాను రాష్ట్రంలో అన్ని జిల్లాలు తిరుగుతున్నానని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన సబ్సిడీ పథకాలు విద్యార్థులకు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. పలు ప్రాంతాలలో విద్యార్థులు కేవలం 60 నుండి 70శాతం మాత్రమే భోజనానికికి హాజరవుతున్నారని అయితే పలమనేరు ప్రాంతంలో మాత్రం విద్యార్థులందరూ హాజరవడం ఉపాధ్యాయుల కషి ఫలితమేని ఉపాధ్యాయులను అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇలాగే కొనసాగాలని ప్రైవేటు పాఠశాలలు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో కూడా మెరుగైనవిద్య, మౌలిక వసతులు అన్ని సజావుగా కొనసాగించాలని సూచించారు.

పేదలకు అందించే నిత్యావసరాలు సకాలంలో పారదర్శకంగా పంపిణీ చేయాలి

పలమనేరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు అందించే నిత్యావసర వస్తువుల సకాలంలో పారదర్శకంగా పంపిణీ చేయాలని రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ సిహెచ్.విజయ ప్రతాప్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ఆహార కమీషన్ డెప్యూటీ డైరెక్టర్ సురేష్, డిఎస్ఓ శంకర్, డిఎం.మోహన్ బాబులతో కలిసి జిల్లాలో రెండు రోజు పర్యటనలో భాగంగా గురువారం ఉదయం పలమనేరు మండల కేంద్రం గంటావురు, ఇందిరమ్మ కాలనలో మండల ప్రాథమిక పాఠశాలను, 38వ రేషన్ షాపు, అంగన్వాడీ కేంద్రాన్ని, ఎండి వాహనం ద్వారా కార్డుదారులకు రేషన్ బియ్యం పంపిణీని పరిశీలించారు. ఎండి వాహనం ద్వారా బియ్యం తీసుకుంటున్న కార్డుదారులు కొత్త బియ్యం ఇస్తున్నారని అన్నం ముద్దగా అవుతోందని, కందిపప్పు ఇవ్వడం లేదని ప్రజలు కమీషన్ దృష్టికి తీసుకువచ్చారు. సివిల్ సప్లై ఎండితో మాట్లాడి మంచి బియ్యం, కందిపప్పు ఇచ్చేటట్లుగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అలాగే బియ్యం, కందిపప్పు, చక్కెరతో పాటుగా గోధుమ పిండి ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అలాగే అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు, బాలింతలకు, పిల్లలకు ప్రభుత్వం ఇచ్చే వైఎస్సార్ సంపూర్ణ కిట్లు, కోడి గుడ్లు, పాలు సకాలంలో అందజేయాలన్నారు. అంగన్వాడీ కేంద్రాం ద్వారా మీకు ప్రభుత్వం ఇచ్చే ఆహార పదార్థాలు సక్రమంగా ఇస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పట్టణంలోని జెడ్‌పి హైస్కూల్‌ను పరిశీలించి మధ్యాహ్న భోజనం తయారుచేసే వంటశాలను, భోజనానిన పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడుతూ బాగా కష్టపడి చదువుకొని ఉన్నత స్థాయికి చేరి మీతల్లిదండ్రులకు చదువుకున్న పాఠశాలకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. స్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా చైర్మన్‌కి ఎంఈఓ, పాఠశాల సిబ్బంది శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ అధికారిని రాజ్యలక్ష్మి, బీసీ సంక్షేమ అధికారి రబ్బానీ బాషా, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఎస్.మూర్తి, స్త్రీ శిశుసంక్షేమ శాఖ నోడల్ ఆఫీసర్ నిర్మల, ఫుడ్‌ఇన్స్పెక్టర్ సతీష్, తూనికలు కొలతల శాఖ ఇన్స్పెక్టర్ దివ్య, తహశీల్దార్ కుప్పస్వామి, మండల విద్యాశాఖ అధికారిణి లీలా రాణి పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: పిల్లలు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని విజయప్రతాప్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం రాత్రి మండలంలోని కమ్మనపల్లి గ్రామం కస్తూర్బా బాలికల పాఠశాలను పరిశీలించారు. అనంతరం బాలికలతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అన్ని రకాల మౌలిక వసతులపై ఆరా తీశారు. బాగా చదవి మంచి తేవాలని సూచించారు. డిడి సునీల్, డిఎస్ఓ శంకర్, డిఎం.మోహన్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.


బైరెడ్డిపల్లిలోని కస్తూర్బా బాలికల హాస్టల్‌లో విద్యార్థినులతో మాట్లాడుత్ను విజయ్ ప్రతాప్ రెడ్డి

అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకోం..: ఎమ్మెల్యే


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని నారా లోకేష్‌ను చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హెచ్చరించారు. గురువారం స్థానిక లక్ష్మీనగర్‌కాలనీలోని వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. యువగళం పాదయాత్ర సందర్భంగా నారా లోకేష్ తనపై చేసిన ఆరోపణలపై కాణిపాకంలో ప్రమాణానికి సిద్ధమా అంటూ సవాలు విసిరారు. జనం లేని పాదయాత్ర చేస్తున్న లోకేష్ జిల్లా నేతలు ఇచ్చిన సిప్ట చదువుతూ భూభకాసురుడు అంటూ అసత్య ప్రచారం చేశారని అన్నారు. తాను చేసిన సేవలను గుర్తించిన ప్రజలు ఎంఎల్‌ఏగా గెలిపించారని సీటు ఇస్తామని చంద్రబాబు నాయుడు మోసం చేశారని గుర్తు చేశారు. నీతి నిజాయితీగా రాజకీయాల్లో ఉన్న తనపై బురదజల్లే ప్రయత్నం టిడిపి నాయకులు మానుకోవాలని హితవు పలికారు. గుడిపాల మండలంలో పశుమేత స్థలం 300 ఎకరాలు ఆక్రమించుకున్నట్లు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని, పశుమంద స్థలానికి పట్టా ఇవ్వరనే విషయం కూడా తెలియకపోవడం లోకేష్ అవివేకానికి నిదర్శమని అన్నారు. అలాగే చిత్తూరు - తచూరు రోడ్డులో మైనింగ్ ఇలా అనేక ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదని కాంట్రాక్టరుగా జీవితాన్ని ప్రారంభించిన తనకు అవినీతి చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. లోకేష్ చేస్తున్న ఆరోపనలు అవాస్తవమని కాణిపాకంలో సత్యం చేసేందుకు సిద్ధమా అంటూ సవాలు విసిరారు. సమావేశంలో నగర మేయర్ అముద, చుడా ఛైర్మెన్ పురుషోత్తంరెడ్డి, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, టౌన్‌బ్యాంకు ఛైర్మెన్ రామగణేష్ పాల్గొన్నారు.

పార్టీ కార్యాలయం పేరిట

అసెండ్ భూమిపై వైసిపి నేతల కన్ను

లబోదిబోమంటున్న దళితులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: వైసిపి కార్యాలయం పేరుతో జిల్లా కలెక్టర్‌కు అతి సమీపంలోని బెంగుళూరు బైపాస్ రోడ్డులోని సర్వే నెంబర్ 210/1లో ఉన్న అసెండ్ భూమి ఏడున్న ఎకరం స్థలాన్ని సొంతం చేసుకొనేందుకు చిత్తూరు ఎంఎల్‌ఏ ఆరణి శ్రీనివాసులు ప్రయత్నిస్తున్నారంటూ ఇరువారంకు చెందిన బాధిత దళిత కుటుంబ సభ్యులు గురువారం తమ అసైండ్ భూమిలో ఆందోళనకు దిగారు. బ్రిటిష్ ప్రభుత్వం తమ పూర్వీకులకు ఏడున్న ఎకరం స్థలం ఇచ్చిందని నాటి నుంచి తాము సాగు చేసుకుంటున్నట్లు మాజీకార్పొరేటర్ రాజేశ్వరి తెలిపారు. గతంలో అనేకమంది ఆక్రమించుకొనే ప్రయత్నం చేస్తే అడ్డుకున్నామని అయితే ఇటీవల చిత్తూరు ఎంఎల్‌ఏ అనుచరుల నుండి తీవ్రమైన ఒత్తిడి ఎదుర్కొవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తహశీల్దార్, రెవెన్యూ సిబ్బందితో వచ్చి మీస్థలం వైసిపి కార్యాలయానికి ఇచ్చేయండి అంటూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని పైగా పోలీసుల ద్వారా తప్పుడు కేసులో ఇరికిస్తామంటూ బెదిరిస్తున్నట్లు చెప్పారు. తాతల కాలం నుండి తమ స్వాధీనంలో ఉన్న భూమిని కాజేసే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. అసైండ్ భూమి తమ కుటుంబసభ్యుల పేర్లపై పట్టాలు మంజురు చేసేందుకు చిత్తూరు తహశీల్దార్ రూ.10లక్షలు లంచంగా అడిగారని అంత మొత్తం ఇచ్చుకొనే స్థితిలో లేకపోవడంతో అన్యాయంగా తమ కుటుంబసభ్యులు 20మందికి ఒకేఒక ఆధారమైన భూమిని కాజేయాలని ప్రయత్నిస్తున్నారని కన్నీటిపర్యంతమయ్యారు.


వైసిపి కార్యాలయం పేరుతో తమ భూమిని కాజేస్తున్నారంటు ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధితులు


దళితుల భూమిని వైసిపి కార్యాలయానికి అప్పగించేందుకు రెవెన్యూ సిబ్బందితో వచ్చిన చిత్తూరు తహశీల్దార్ పార్వతి

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వర రెడ్డి

ప్రజాశక్తి- పెద్దపంజాణి: రాష్ట్రంలో ఇప్పటివరకు ఖాళీ అయిన ఉద్యోగపోస్టులను ప్రభుత్వం వెంటనే భర్తీచేయాలని ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల పిడిఎఫ్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వర రెడ్డి కోరారు. గురువారం పెద్దపంజాణి మండలంలో ఎన్నికల క్యాంపెయిన్ నిర్వహించారు. ఈసందర్భంగా విలేకర్లతో ఆయన మాట్లాడుతూ మార్చినెల 13వతేదీన ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగనున్నాయని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, నిరుద్యోగుల సమస్యలపట్ల శాసన మండలిలో మాట్లాడడానికి అవకాశం కల్పించాలని కోరారు. గ్రాడ్యుయేట్ ఓటర్లు తమ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో అన్ని వ్యవస్థల్లోనూ భారీగా ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి కానీ భర్తీకి చర్యలు చేపట్టడం లేదని, ఉపాధ్యాయుల పోస్టులు దాదాపు 50వేలు ఖాళీగా ఉన్నాయని ఇంతవరకు డిఎస్సికి ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వలేదని నిరుద్యోగులు పెరిగారని అన్నారు. యూనివర్సిటీలు, డిగ్రీ కళాశాల, జూనియర్ కాలేజీలు, సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, ఏపీ రెసిడెన్షియల్ లాంటి స్కూల్స్‌లో రెగ్యులర్ పోస్టులున్నా భర్తీ చెయ్యకుండా కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో ఉపాధ్యాయులను నియమించుకుని ప్రభుత్వాలు అతి తక్కువ వేతనాలు చెల్లిస్తూ శ్రమ దోపిడీకి గురిచేస్తున్నారని అన్నారు. బాలికల విద్య కోసం ఏర్పాటు చేసిన కేజీబివిలలో పనిచేసే ఉపాధ్యాయులకు ఆ స్కూల్స్‌లో నేటికీ రెగ్యులర్ పోస్టులు కేటాయించకుండా ఆ స్కూల్స్‌ను ఇంటర్ వరకు పొడిగించారు కానీ వారికి అందరితో పాటు జీతాలు చెల్లించకుండా కేవలం 23శాతం మాత్రమే పెంచారని, వారికి మినిమం టైంస్కేల్ చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే సిపిఎస్ విధానానిన రద్దు చేయాలని, ప్రతి నెలా 1వ తేదీన ఉద్యోగ, ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలని కోరారు. అలాగే పెన్షనర్లకు చెల్లించాల్సి పిఆర్‌సి అరియర్లు ఏమైయ్యాయో తెలీదని ఈ సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. యుటిఎఫ్ జిల్లా బాధ్యులు ఎం.వి.రమణ, వ్యకాసం నాయకులు ఓబుల్‌రాజు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వర రెడ్డి

ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సిద్ధం కండి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి
జిల్లాలో మూడు ఎమ్మెల్సీ స్థానాలకు షెడ్యూల్ విడుదల

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రకాశం నెల్లూరు చిత్తూరు పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గం, స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి ఆంధ్రప్రదేశ్ శాసనమండలికి ఎన్నికలు నిర్వహించడానికి భారత ఎన్నికల సంఘం న్యూఢిల్లీ వారు షెడ్యూలు విడుదల చేసినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి యం.హరి నారాయణన్ తెలిపారు. గురువారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా ఉపాధ్యాయ, పట్టభద్రుల మరియు స్థానిక సంస్థల నియోజకవర్గం నుండి ఆంధ్రప్రదేశ్ శాసన మండలి ఎన్నికలు నిర్వహించడానికి ఎన్నికల నిర్వహణపై వర్చువల్ విధానంలో అన్ని జిల్లాల కలెక్టర్‌లతో సమీక్ష నిర్వహించారు. ఈవీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ యం.హరి నారాయణన్, డిఆర్ఓ ఎన్.రాజశేఖర్ నియోజకవర్గాల ఈఆర్ఓలు పాల్గొన్నారు. ఈసందర్భంగా రాష్ట్ర ప్రధానఎన్నికల అధికారి మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం న్యూఢిల్లీ వారు విడుదల చేసిన షెడ్యూల్ మేరకు ఈనెల 16న నోటిఫికేషన్ జారీ, నామినేషన్లు వేయడానికి చివరి తేదీ ఈనెల 23, పోలింగ్ మార్చి 13వ తేదీ, ఓట్ల లెక్కింపు మార్చి 16వ తేదీన జరుగునని ఎన్నికల ప్రవర్తన నియమావళి తక్షణమే అమలులోకి రావడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రకాశం -నెల్లూరు- చిత్తూరు పట్టభద్రుల నియోజకవర్గం, ఉపాధ్యాయుల నియోజకవర్గం, స్థానిక సంస్థల నియోజక వర్గం నుండి ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. చిత్తూరు జిల్లాకు సంబంధించి ఫైనల్ రోల్ ప్రకారం పట్టభద్రుల నియోజకవర్గంకు 51 పోలింగ్ స్టేషన్‌లలో 54,237మంది నమోదు కాగా ఉపాధ్యాయ నియోజకవర్గానికి సంబంధించి 33 పోలింగ్ స్టేషన్‌లలో 3,545మంది నమోదు అయినట్లు వివరించారు. అందిన క్లెయిమ్స్ పరిశీలనను త్వరితగతిన పరిష్కరించనున్నామని, పోలింగ్, కౌంటింగ్ నిర్వహణకు శిక్షణ ఇవ్వనున్నట్లు, ఎన్నికల నిర్వహణకు అవసరమైన ప్రభుత్వ ఉద్యోగుల జాబితాను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌కు ఎలక్షన్ విభాగం సూపరింటెండెంట్ పద్మజ, డిప్యూటీ తహశీల్దార్లు పార్థసారథి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

సర్క్యులర్ 64ను రద్దు చేయాలి : సిఐటియు



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వాడ గంగరాజు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాలో ఉన్న వీఓఏల సమస్యల పరిష్కారం కోసం గురువారం కాణిపాకంలో యూనియన్ జిల్లా సమావేశం జీను రాజశేఖర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిధిగా హాజరైన సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వాడ గంగరాజు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం దుర్మార్గంగా 64 సర్క్యులర్ తీసుకువచ్చి వీఓఏలను ఇంటికి పంపించే కార్యక్రమం చేయడం దారుణమన్నారు. ఎక్కడా లేనివిధంగా మూడు సంవత్సరాల కాలపరిమితి పెట్టడం, జిల్లా అధికారులు అత్యుత్సాహం చూపి సంఘాలను మెర్జ్ చేసే పని ప్రారంభించడం ఏమిటని ప్రశ్నించారు. 171 మందిని తొలగించడానికి ప్రయత్నం చేస్తున్నారని ఇది ఇంతటితో ఆగదని అందరికీ ప్రమాదం వచ్చే పరిస్థితి ఉండడంతో ఐక్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. ఈ సమస్యలు పరిష్కారం కోసం దశల వారి పోరాటాలకు సిద్ధం కావాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీల ప్రకారం వీవోఏలకు కనీస వేతనాలు అమలు చేయాలని, హెచ్ఆర్ పాలసీమలు చేయాలని, 64 సర్క్యులర్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి నాగరాజు, కోశాధికారి వసంత, నాయకులు మమత, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

చట్టసభలు జరిగే విధానం తెలుసుకోవాలి: ఎమ్మెల్యే



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎంఎల్ఏ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వాల ఆశయాల మేరకు కేంద్ర యువజన, క్రీడా మంత్రిత్వశాఖకు చెందిన నెహ్రూ యువకేంద్ర చిత్తూరు ఆధ్వర్యంలో నైబర్హుడ్ యూత్ పార్లమెంట్ కార్యక్రమం స్థానిక ఎస్వి సెట్ కళాశాల సమావేశ మందిరంలో గురువారం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా చిత్తూరు నగర శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులు పాల్గొన్నారు. విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ 75సంవత్సరాల స్వాతంత్ర భారతదేశంలో ప్రజాస్వామ్యం అనేది మనకు లభించిన అమూల్యమైన సంపద అని అన్నారు. ప్రతిఒక్కరూ చట్టసభలు జరిగే విధానం గురించి తెలుసుకొని అవగాహన కల్పించాలన్నారు. నగర మేయర్ ఎస్.ఆముద మాట్లాడుతూ ప్రభుత్వం చేసే సంక్షేమ కార్యక్రమాలను తెలుసుకొని ప్రజలందరూ ప్రభుత్వానికి తోడ్పాటును అందించాల్సిందిగా కోరారు. సమావేశానికి మునుపు విద్యార్థి విద్యార్థులు మోక్ పార్లమెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఆరోగ్య విద్యాధికారి పి.గుణశేఖర్, యువతకు కావాల్సిన పౌష్టికాహారాలు, శారీరక దఢత్వం గురించి ఉపన్యాసం ఇచ్చారు. అనంతరం అనేక సాంస్కృతిక కార్యక్రమాల్లో యువత పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి జ్ఞాపికలు, ధవపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా యువజన అధికారి బి.ప్రదీప్ కుమార్, ఎస్వి సెట్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.మోహన్ బాబు, ఉపాధ్యాయులు, జాతీయ యువకార్యకర్తలు, జాతీయ సేవాకార్యకర్తలు పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధి కోసమే ఆర్బికెలు

జిల్లా అగ్రికల్చరల్ అధికారి హబీబ్ బాషా

ప్రజాశక్తి- సోమల: రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల వల్ల రాష్ట్రంలోని రైతులు నూతన వ్యవసాయవిధానాలను, వ్యవసాయ యాంత్రీకరణ పద్ధతులను నేర్చుకుని అభివద్ధికి రావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి హబీబ్ బాషా అన్నారు. గురువారం మండల కేంద్రమైన సదుం రైతు భరోసా కేంద్రంలో మండలంలోని ఏఈఓలు, ఎంపీఈవోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ సిబ్బంది రైతుల అభివద్ధి కోసం ఎప్పటికప్పుడు నూతన వ్యవసాయ విధానాలను యాంత్రికరణ పద్ధతులను తెలియజేస్తూ రైతులకు ప్రభుత్వం అందించే రైతు భరోసా నగదును వారి ఖాతాలలో జమ చేసే విధంగా రైతుల నుండి ఆధార్ బ్యాంక్ అకౌంట్లను సేకరించి ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలన్నారు. ముఖ్యంగా పంట నమోదు, పీఎం ఈ-కేవైసీ, ఎరువుల సరఫరా వంటి ప్రభుత్వ సూచనలను రైతులకు లబ్ధి చేకూర్చే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా పలు రైతుల పంటపొలాలను పరిశీలించి రైతులకు సూచనలను అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారిని మాధవి, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్సీపీ హయాంలో గ్రామాల అభివృద్ధి

రూ.24 లక్షలతో అభివృద్ధి పనులకు భూమిపూజ


భూమిపూజ చేస్తున్న ఎంపిపి లతాబాలాజీ

ప్రజాశక్తి- కార్వేటినగరం: వైఎస్సార్సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాతే గ్రామాలు అభివద్ధిబాటలో నడుస్తున్నాయని ఎంపీపీ లతబాలాజీ అన్నారు. గురువారం మండల పరిధిలోని కొల్లగుంట గ్రామంలో పలు అభివద్ధి పనులకు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్రెడ్డి అధికారం చేపట్టాకే గ్రామాలు అభివద్ధి చెందుతున్నాయని గుర్తుచేశారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి చొరవతో కమ్యూనిటీ భవన నిర్మాణానికి రూ.12,50లక్షలు, సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.7.5 లక్షలు నిధులు మంజూరు చేశారని తెలిపారు. అదేవిధంగా ఎంపీపీ నిధులు రూ. 4లక్షలు కూడా మౌలిక వసతులకు వెచ్చించడం జరిగిందన్నారు. మండలంలో 98శాతం సీసీ రోడ్లు, బీటీ రోడ్లు పూర్తి అయ్యిందని పేర్కొన్నారు. 2 శాతం అభివద్ధి పనులకు ప్రణాళికసిద్ధంగా ఉందని వందశాతం పూర్తిచేసి సమస్యల రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడానికి రాష్ట్రప్రభుత్వం కషిచేస్తోందన్నారు. అనంతరం సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. కోలప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్రెడ్డి, సర్పంచ్ దివ్య, ఎంపీటీసీ శ్రీనివాసులురెడ్డి, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ సుబ్రమణ్యం, మాజీ సర్పంచ్ మునికష్ణ, శేషాద్రి పాల్గొన్నారు.


జలజీవన్ మిషన్ ద్వారా నీటి ట్యాంకు నిర్మాణం


భూమిపూజ చేస్తున్న జెడ్పీటీసీ నితిన్ రాఘవరెడ్డి

ప్రజాశక్తి- రామకుప్పం: రామకుప్పం మేజర్ గ్రామపంచాయతీలోని మిట్టపల్లి గ్రామంలో జలజీవన్ మిషన్ నిధుల ద్వారా రూ.21,26,000లతో ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకును నిర్మించుటకు గురువారం భూమిపూజ చేపట్టారు. గ్రామంలో శాశ్వత నీటిసమస్యను పరిష్కరించి ప్రజల దాహార్తిని తీర్చేందుకు గాను 40వేల లీటర్ల సామర్థ్యం కలిగిన ఈ టాంకు నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. జెడ్పీటీసీ నితిన్ రాఘవరెడ్డి, ఎంపిపి సుబ్రహ్మణ్యం, సర్పంచ్ మురళీకృష్ణ, వైసిపి మండల కన్వీనర్ బాబురెడ్డి, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

బంగాళా దుంప సాగు భళా..!

- వంద రోజులకే చేతికొస్తున్న పంట
- తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం
- ఆసక్తి చూపుతున్న రైతన్నలు



ప్రజాశక్తి- గంగవరం: మండలంలోని పడమటి పంచాయతీల్లో ఇటీవల కాలంలో ఎక్కువ మంది రైతులు బంగాళాదుంప, దోస, కీరా పంటలపై మక్కువ చూపుతున్నట్లు రైతులు చెబుతున్నారు. ఈ పంటలు వంద రోజుల్లోనే చేతికొస్తున్నాయని, తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం అందుతోందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కూరగాయలు పండించటం వలన రైతులకు కొంత మేర ఊరట కలుగుతున్న నేపథ్యంలో ఎక్కువగా పండిస్తున్నారు.

మండలంలోని రైతు హూసరాయ గౌడ మాట్లాడుతూ తనకున్న రెండు ఎకరాల భూమిలో ఎకరా భూమిలో కీరదోస సాగు, మరో ఎకరా బంగాళా దుంపలు సాగుచేస్తున్నట్లు తెలిపారు. ఒక ఎకరా పంట సాగు చేయడానికి ఒకట్నిర లక్ష పెట్టుబడి పెట్టామని చెప్పారు. ఇందులో రూ.30వేలు విత్తనాలకు ఖర్చు అయ్యిందని, వారానికోసారి పురుగుమందులకు పెట్టుబడి పెట్టినట్లు చెప్పారు. పంట చేతికొచ్చిన తరువాత కిలో రూ.25 నుంచి 30 రూపాయల ధర పలికితే పెట్టుబడిగా పెట్టిన ఖర్చు పోను తమ కష్టం మిగులుతుందని తెలిపారు. ఈసారి పంట ఎదుగుదల బాగుండటంతో పంట పూర్తి అయ్యేలోపు 30 టన్నుల దాకా కాపు వస్తుందని, తమ కష్టానికి గిట్టుబాటు దక్కిందని తెలిపారు. అంతేకాకుండా 3 నెలలకు ఒకసారి పంట రావడం వలన సంవత్సరంలో 3సార్లు పంట పండించడానికి అవకాశం ఉందన్నారు. కూరగాయల పంటలకు భూసారం బాగా ఉండాలని, సేంద్రియ పద్ధతిలో పండించడం వలన అధిక దిగుబడితో పాటు ఆరోగ్యానికి మేలు కలుగుతుందని తెలిపారు.

నగరపాలక స్టాండింగ్ కమిటీ సమావేశం

పలు అభివృద్ధి పనులకు ఆమోదం


స్టాండింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న నగర కమిషనర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: నగరపాలక సంస్థ పరిధిలో పలుఅభివద్ధి పనులకు నగరపాలక స్టాండింగ్ కమిటీ ఆమోదముద్ర వేసింది. నగరపాలక స్టాండింగ్ కమిటీ సమావేశం నగరపాలక కార్యాలయంలో గురువారం సాయంత్రం జరిగింది. మేయర్ ఎస్.అముద, కమిషనర్ డాక్టర్ జె.అరుణ, స్టాండింగ్ కమిటీ సభ్యులు ఆర్.చంద్రశేఖర్, ఆర్జి.శ్రీకాంత్, సి.శోభ, ఎజి.సహదేవున్ పాల్గొన్నారు. సమావేశంలో అజెండాలో పొందుపరిచిన పలుఅభివద్ధి పనులపై చర్చించి ఆమోదించారు. స్టాండింగ్ కమిటీ తీర్మానాలు చిత్తూరు నగరపాలక సంబంధించి వాహనాల షెడ్డు ప్రాంగణంలో ఉన్న పాత ఇనుపవస్తువులకు నిర్వహించిన వేలంపాటలో హెచ్చు పాటదారులకు ఎల్ఓఏ ఇచ్చుటకు.. కాలుష్య నియంత్రణ మండలి నిధులతో 8వ వార్డు పరిధిలో పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి సర్కిల్ అభివద్ధి, ఆర్టీసీ బస్టాండ్ డివైడర్లో పచ్చదనం పెంపు పనులకు పిలిచిన టెండర్లలో ఎల్1 గా నిలిచిన బిడ్డరుకు ఎల్ఓఏ జారీ చేయుటకు ఆమోదించింది. అలాగే ఎమ్మెస్సార్ సర్కిల్ నుంచి గాంధీసర్కిల్ వరకు ప్రస్తుతం ఉన్న ఐరన్ గ్రిల్ డివైడర్ల స్థానంలో ప్రీకాస్ట్ ఆర్సీసీ మౌల్డ్స్ ఏర్పాటు చేయుటకు పిలిచిన టెండర్లలో ఎల్1గా నిలిచిన బిడ్డరుకు ఎల్ఓఏ జారీ చేయుటకు, నగరపాలక సంస్థ పరిధిలో వివిధ డివిజన్లో అద్దె ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయుటకు పిలిచిన టెండర్లలో ఎల్1గా నిలిచిన బిడ్డరుకు ఎల్ఓఏ జారీ చేయుటకు స్టాండింగ్ కమిటీ ఆమోదముద్ర వేసింది. సమావేశంలో ఎంహెచ్వో డాక్టర్ లోకేష్, ఎంఈ ధనలక్ష్మీ, ఏసీపీ రామకష్ణుడు, మేనేజర్ ఉమామహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

అర్బన్ ఆరోగ్య కేంద్రాల భవన నిర్మాణాలు పూర్తిచేయాలి


నగర కమిషనర్ అరుణ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: నగరపాలక పరిధిలో నిర్మాణదశలో ఉన్న ఆరోగ్యకేంద్రాల భవనాలను నెలాఖరులోగా పూర్తి చేయాలని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కమిషనర్ గురువారం ఉదయం మాపాక్షి అర్బన్ ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఇంకా చేపట్టాల్సిన పనులపై ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడారు. పెండింగ్ పనులను వేగంగా పూర్తిచేయాలని, ఫిబ్రవరి నెలాఖరుకు భవనాన్ని పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని ఆదేశించారు. అనంతరం నగరపాలక పరిధిలో నిర్మాణదశలో అర్బన్ ఆరోగ్య కేంద్రాల పురోగతి పైన ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అంతకుముందు కమిషనర్ అనుప్పల్లి జగనన్న హౌసింగ్ లేఅవుట్ను సందర్శించారు. వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణ పనులను తనిఖీ చేశారు. పునాదులు పూర్తి చేసిన లబ్ధిదారులతో మాట్లాడి మిగిలిన పనులు త్వరగా పూర్తిచేయించాలని న్నారు. వారాంతపు లక్ష్యాలు సాధించడం ద్వారా మార్చి 15నాటికి నిర్దేశించుకున్న మేరకు గహాలను పూర్తి చేయగలమని, ఆ మేరకు పనులు వేగంగా జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంఈ ధనలక్ష్మీ, డీఈ వెంకట ప్రసాద్, హౌసింగ్ ఏఈ శ్రీధర్, ఎంఈ శ్రీలత, అమినిటీ కార్యదర్శులు పాల్గొన్నారు.


అర్బన్ హెల్త్ సెంటర్ల నిర్మాణాలు పరిశీలిస్తున్న నగర కమిషనర్

సేవా భావం చాటుకున్న పోలీసులు

చిన్నారి వైద్యంకు రూ.6,48,000లు సాయం



రాజుకు ఆర్థిక సాయం అందిస్తున్న ఎస్పీ రిషాంత్రెడ్డి, చికిత్స పొందుతున్న చిన్నారి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: పోలీస్ కుటుంబాల్లో ఎవరికి కష్టం వచ్చినా మేమున్నామంటూ సాయం చేశారు చిత్తూరు పోలీసులు. క్యాసర్ వ్యాధితో బాధపడుతున్న చిన్నారి జేనిష వైద్యఖర్చుల కోసం రూ.6,48,000లు సాయం చేసి తమ సేవాభావం చాటుకున్నారు. జిల్లా మోటార్ ట్రాన్స్పోర్ట్ ఆఫీస్లో ఉద్యోగం చేస్తూ కాణిపాకం పోలీస్ స్టేషన్లో అటాచ్మెంట్పై డ్రైవర్గా విధులు నిర్వహిస్తున్న రాజు కుమార్తె జేనిష ఆరోగ్యం బాగోలేదని ఆసుపత్రిలో పరీక్షించగా డాక్టర్లు బ్లడ్ కాన్సర్ అని వైద్యులు నిర్ధారించారు. మెరుగైన చికిత్స కొరకు పాపను వేలూరు సిఎంసిలో అడ్మిట్ చేశారు. చికిత్స నిమిత్తం 7 నుండి 8లక్షల వరకు ఖర్చు అవుతుందని డాక్టర్లు తెలిపారు. తన కుమార్తెకు వైద్యం చేసేందుకు ఆర్థిక స్తోమత లేని రాజు జిల్లా ఎస్పీ రిషాంత్రెడ్డి దృష్టికి విషయం తీసుకుపోయారు. జిల్లా ఎస్పి విజ్ఞప్తి మేరకు పోలీస్ యంత్రాంగం తలోచేయి వేసి రూ.6,48000లు సేకరించి చిన్నారి వైద్య ఖర్చులకోసం అందించారు. గురువారం ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఎస్పి చేతులు మీదుగా రాజుకు ఆ మొత్తాన్ని అందించారు. చిన్నారి వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం అందించిన పోలీస్సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు. తన బిడ్డ ప్రాణం నిలిపిన పోలీసు సిబ్బందికి రాజు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లాలో 766 గ్రామాలలో డ్రోన్ సర్వే పూర్తి


ఇప్పటి వరకు 253 ఓఆర్ఐలు : జెసి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు జిల్లాలో మరో 57 గ్రామాల్లో డ్రోన్ సర్వే జరగాల్సి ఉందని జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. గురువారం మధ్యాహ్నం సిసిఎల్ఏ ప్రత్యేక కార్యదర్శి సాయిప్రసాద్, కార్యదర్శులు ఇంతియాజ్, శ్రీధర్, గణేష్ వీడియో కాన్ఫరెన్స్ను నిర్వహించారు. ఈసందర్భంగా జెసి మాట్లాడుతూ జిల్లాలోని 823 గ్రామాలకు గాను 766 గ్రామాలకు సంబంధించి డ్రోన్ సర్వే పూర్తి అయ్యిందని, 253 గ్రామాలకు సంబంధించి ఓఆర్ఐ షీట్లు రావడం జరిగిందన్నారు. అందులో 53 ఓఆర్ఐ షీట్లు తప్పులు రావడం జరిగిందని మిగతా 200గ్రామాల్లో 141గ్రామాలకు 13 నోటిఫికేషన్ ఇవ్వడం జరిగిందన్నారు. మిగతా గ్రామాల్లో జిటితో పాటు వివిధస్థాయిల్లో జరుగుతున్నాయని, రీసర్వే ప్రక్రియ జరుగుతుందని వివరించారు.

ఇసుక, ఎర్రచందనం అక్రమ రవాణా పై

ప్రత్యేక నిఘా పెట్టాలి: డిఎస్పీ

ప్రజాశక్తి- పాలసముద్రం: పాలసముద్రం మండలం తమిళనాడు సరిహద్దులో ఉన్నందున ఇసుక, ఎర్రచందనం అక్రమ రవాణా జరిగే అవకాశం ఎక్కువగా ఉన్నందున ప్రత్యేక నిఘా పెట్టాలని డిఎస్పీ రవికుమార్ సూచించారు. గురువారం పాలసముద్రం పోలీసుస్టేషన్ను డిఎస్పీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు స్టేషన్కి ఫిర్యాదు చేయడానికి వస్తున్న ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలని, సమస్యను తర్వితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. రాత్రి సమయాల్లో తమిళనాడు సరిహద్దులో పోలీసు సిబ్బంది కచ్చితంగా నిఘా పెట్టాలని ఆదేశించారు. అలాగే వాహనదారులు రోడ్డు భద్రతా నిబంధనలు పాలించేలా అవగాహన కల్పించాలని, నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. సిఐ చంద్రశేఖర్, ఎస్ఐ సురేష్ పాల్గొన్నారు.


పోలీసు స్టేషన్లో తనిఖీ చేస్తున్న డిఎస్పీ రవికుమార్

సంక్షిప్త వార్తలు

11న జాతీయ లోక్ అదాలత్



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్ ఈనెల 11వ తేదీన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం జరుగుతుందని క్షక్షిదారులు ఈ లోక్అదాలత్ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ ఐ. కరుణకుమార్ తెలిపారు. గురువారం జిల్లా సేవాధికార సంస్థ సెక్రటరీ విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 11వ తేదీన జరగనున్న లోక్అదాలత్లో సత్వరన్యాయం అందించడానికి, కేసుల తాకిడిని తగ్గించడానికి అప్పీల్ లేని న్యాయాన్ని పొందడానికి కచ్చితమైన పాత్ర పోషిస్తున్నామని తెలిపారు. జిల్లాల్లో ఉన్న ప్రాంతీయ కోర్టులన్నింటిలోనూ జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లా జడ్జి ఈ.భీమారావు నాయకత్వంలో జాతీయ లోక్అదాలత్ నిర్వహించడం జరుగుతుందని, విజయవంతం చేయాలన్నారు.

సోమల: ఈనెల 11వ తేదీ శనివారం నియోజకవర్గ కేంద్రమైన పుంగనూరు కోర్టులో నిర్వహించే లోక్ అదాలత్ను సద్వినియోగం చేసుకోవాలని హెడ్ కానిస్టేబుల్ మునిప్రసాద్ తెలిపారు. సోమల పోలీసులు బస్టాండ్ కూడలిలో మహిళా పోలీసులతో కలిసి ర్యాలీ నిర్వహించి ప్రజలకు తెలియజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ లోక్అదాలత్ ద్వారా రాజీ అయ్యే కేసులను అప్పటికప్పుడు రాజీచేసి కేసు కొట్టి వేయబడుతాయని, క్రిమినల్, సివిల్ కేసులు కలిగిన వారు లోక్అదాలత్ను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. రాజీ మార్గమే రాజ మార్గమని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపి నాయకులతో సమావేశం

ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలోని తెలుగుదేశం పార్టీ అసమ్మతి నేతలను గంగాధరనెల్లూరు నియోజకవర్గ పరిశీలకులు సురేంద్ర యాదవ్ గురువారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండల కేంద్రమైన వెదురుకుప్పంలో టిడిపికి బలమైన నాయకత్వం ఉందని, కొందరు నాయకులు చిన్నచిన్న సమస్యల వలన అసమ్మతిలోకి వెళ్లారని తెలిపారు. టిడిపిలో కష్టపడే వారికి తగిన గుర్తింపు ఉంటుందని, పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేయాలని, పూర్వవైభవం తేవాలని సూచించారు. అనంతరం బత్తల చిరంజీవిరెడ్డి, రమేష్రెడ్డి, మునస్వామి, భాస్కర్రెడ్డిలను పాదయాత్రకు ఆహ్వానించారు.



చేపల చెరువులు వేలం

ప్రజాశక్తి- సోమల: మండలంలోని మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు పంచాయతీలోని ఏడు చేపల చెరువులు, కుంటల వేలంపాటలు నిర్వహించనున్నట్టు పంచాయతీ కార్యదర్శి జయశంకర్ తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఉదయం 11గంటలకు సిద్ధచెరువు, తిప్పానిచెరువు, బాపనకుంట, అక్కగార్ల చెరువు, తిప్పానిఒడ్డు, బసినాయనచెరువు, జులపాలకుంట చెరువులకు, కుంటలకు వేలంపాటలు నిర్వహిస్తామని వేలంపాటలో పాల్గొన్న దలచిన వారు పంచాయతీవారు సూచించిన మేర నిర్ణీత రుసుమును చెల్లించి వేలంపాటలో పాల్గొనవచ్చునని తెలిపారు.

హజ్ కోసం ఆన్లైన్ దరఖాస్తు పూర్తి ఉచితం

ప్రజాశక్తి- పుంగనూరు: ఈ వారం హజ్ కోసం ఆన్లైన్లో దరఖాస్తులు చేసుకోవచ్చు అని, ఇది పూర్తిగా ఉచితంగానే ఉంటుందని ప్రధాన మంత్రి జన్ కళ్యాణ్ కారి యోజన రాష్ట్రఅధ్యక్షులు అయూబ్ ఖాన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సారి హజ్ కోసం వెళ్లే వారు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవడం ఉచితం అని చెప్పారు. గతంలో ఒక్కో యాత్రికుడికి రూ.300లు దరఖాస్తు రుసుం ఉండేదని, అంతే కాకుండా హజ్ యాత్రపై ఖర్చు కూడా తగ్గుతుందన్నారు. ఒక్కో హజ్యాత్రకు దాదాపు రూ.50 నుంచి 60వేల వరకు ఖర్చు తగ్గుతుందని తెలిపారు. 45ఏళ్లు పైబడిన మహిళలు కూడా ఇప్పుడు హజ్కు అర్హులుగా ఉంటారన్నారు. స్వతంత్రంగా దరఖాస్తు చేసుకోవచ్చు అన్నారు. వద్ధులు, వికలాంగులు, మహిళలకు ప్రాధాన్యత ఇవ్వబడుతుందని తెలిపారు. 1.75 లక్షల మందిలో 80శాతం మంది హాజీలు హజ్ కమిటీ ద్వారా, 20శాతం మంది ప్రైవేట్ టూర్ ఆపరేటర్ల ద్వారా వెళతారని చెప్పారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన

ప్రజాశక్తి- వెదురుకుప్పం: స్థానిక జెడ్పి ఉన్నత పాఠశాలలో 8,9,10 తరగతుల విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య విషయాలు, కౌమార దశలో వచ్చే మార్పుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గురువారం డాక్టర్ ప్రవీణ ప్రధానోపాధ్యాయులు వెంకట రమణారెడ్డి ఆధ్వర్యంలో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రవీణ మాట్లాడుతూ విద్యార్థులందరూ కౌమార దశలో తమలో వచ్చే మార్పులను గురించి తెలుసుకోవాలన్నారు. అలాగే బాలికలు రక్తహీనత, బాల్యవివాహాలు, పౌష్టికాహార లోపం వలన కలిగే అనారోగ్య పరిస్థితులను గురించి, విటమిన్ల లోపం వలన కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. ఏఎన్ఎం ఎర్రసానమ్మ, ఆశాలు గీత, బుజ్జి, పవిత్ర, ఉపాధ్యాయులు జి.భ్రమరాంబ, జి.శ్యామల, పి.జ్యోత్స్న, పి.మురళిరెడ్డి, ప్రభాకర్రెడ్డి, ఉమామహేశ్వర్, భద్రావతి, విజయలక్ష్మీ పాల్గొన్నారు.

100 శాతం ఫలితాల కోసం నైట్ విజన్

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన సోమలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బందం, మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బందం పదవ తరగతి విద్యార్థుల విద్యాప్రమాణాలు మరింతగా పెంపొందించేందుకు నూతన వరవడి చేపట్టారు. ఇందులో భాగంగా ఉపాధ్యాయులు పదవ తరగతి విద్యార్థుల ఇండ్ల వద్దకు వెళ్లి రాత్రి వేళల్లో వారికి పాఠ్యాంశాలలో ఏవైనా అనుమానాలుంటే వాటిని నివత్తి చేయడం విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడడం తల్లిదండ్రులకు కూడా పలు సూచనలు చేయడం చేస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నైట్విజన్ కార్యక్రమం ద్వారా విద్యార్థులలో మరింత నైపుణ్యాన్ని సామర్థ్యాన్ని పెంపొందించేందుకు అవకాశం ఉందని, ఇందుకోసం తాము విద్యార్థుల ఇండ్లవద్దకే వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడి వారిని మరింత బాగా చదివించాలని తమ పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేకశ్రద్ధ చూపాలని తెలియజేస్తున్నామని దీనివల్ల 100 శాతం ఫలితాలు సాధించేందుకు తమ వంతు ప్రయత్నం చేస్తున్నామని ప్రధానోపాధ్యాయులు శివరత్న, హరినాథ్ రెడ్డి తెలిపారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతినెలా 9వ తేదీ జరిగే ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహతి పౌండేషన్ ఛైర్మన్ నాగరాజు సహకారంలో గర్భిణులకు పౌష్టికాహారం అందించారు. డాక్టర్ విజయ్చంద్ర మాట్లాడుతూ బాల్యవివాహాలు చేయకూడదని, దీని వలన మాతాశిశు మరణాలు అధికంగా జరిగే ప్రమాదం ఉందని, కనుక బాల్యవివాహాల నివారణకు చర్యలు చేపట్టాలని అన్నారు. అలాగే గర్భిణులు అంగన్వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారం తీసుకోవడం వలన తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. గర్భస్థ పిండ లింగనిర్ధారణ చట్టరీత్యా నేరమని హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రి తెలిపారు. కార్యక్రమంలో డాక్టర శాలిని, వైద్యసిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.


గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్న మహతి పౌండేషన్ ఛైర్మన్ నాగరాజు

జి-20 పై మహిళా రైతులకు శిక్షణ

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలోని నెల్లిపట్ల వైఎస్సార్ రైతు భరోసా కేంద్రంలో చిత్తూరు జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు గోపాల్ మహిళా రైతులకు జి-20పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ సుస్థిర వ్యవసాయం, ప్రకతి వ్యవసాయం, పోషక విలువలు, చిరుధాన్యాల ప్రాముఖ్యత, చిరుధాన్యాల సాగు వల్ల కలిగే ప్రయోజనాలు, తక్కువ నీటితో పండించేపంటలు మొదలైన విషయాల గురించి మహిళలకు శిక్షణ ఇచ్చారు. మండల వ్యవసాయాధికారి మునికష్ణ, వ్యవసాయ సహాయకులు, మహిళ రైతులు తదితరులు పాల్గొన్నారు.

